రైతుల పరిస్థితి ఆగమాగం

- పెరిగిన పెట్టుబడి, తగ్గిన దిగుబడి
- పూర్తిస్థాయిలో అందని నష్టపరిహారం
- కొంతమంది రైతులకు ఇంకా అమలు కాని రుణమాఫీ


దెబ్బతిన్న పంటను చూపిస్తున్న రైతు (ఫైల్)


ఈయన పేరు కుమ్మరి పోతారెడ్డి. గత ఏప్రిల్, మేలో కురిసిన వర్షాలకు మొక్కజొన్న పంట దెబ్బతింది. అధికారులు పంట నష్టపరిహారాన్ని అంచనా వేసి, ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. కానీ ఇప్పటి వరకు పంట నష్ట పరిహారం అందలేదు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ సైతం అందలేదు.

బోథ్: రైతుల పరిస్థితి నానాటికీ అగమ్యగోచరంగా మారుతోంది. పంట పెట్టుబడి విపరీతంగా పెరిగింది. దీనికి తోడు అధిక వర్షాల వల్ల గతంలో పంట నష్టపోయారు. నష్టపోయిన పంటలకు ఇప్పటికీ నష్ట పరిహారం అందలేదు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ కూడా కాలేదని వాపోతున్నారు. తాము పండించే పంటలకు మద్దతు ధర ఇవ్వకపోతే అప్పులపాలవుతామని ఆందోళన చెందుతున్నారు.

పంట నష్ట పరిహారమేది..

గత ఏప్రిల్, మే నెలలో కురిసిన భారీ వర్షాలకు పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో స్పందించిన సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించాలని ఆదేశించారు. దీంతో వ్యవసాయాధికారులు పంటల పరిశీలన చేశారు. 33 శాతం దెబ్బతింటేనే పంట నష్టపరిహారం వస్తుందని మెలికపెట్టారు. దీంతో చాలా మంది రైతులు పంటలు నష్టపోయినా.. అధికారులు పంటల నష్టాన్ని అంచనా వేయలేదు. రైతుల ఆందోళనలతో పంట నష్టంపై సర్వే చేసి అధికారులకు అందజేశారు. ఇప్పటివరకు పంట నష్ట పరిహారం రైతులకు అందలేదు. బోథ్‌లోనే 45 మందికి పంట నష్ట పరిహారం రాలేదు. కలెక్టర్‌కు విన్నవించినా లాభం లేకుండా పోయిందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

రుణమాఫీ సైతం..

కొంతమంది రైతులకు ఇంకా రుణమాఫీ కాలేదు. ఎందుకు కాలేదని అధికారులను అడిగితే తమకేమీ తెలియదని సమాధానం ఇస్తున్నారు. ఇప్పటికే బ్యాంకుల్లో అప్పులకు వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రుణమాఫీ వెంటనే చేయాలని రైతులు కోరుతున్నారు.

రుణమాఫీ కాలేదు


గత ఏప్రిల్, మేలో అధిక వర్షాల కారణంగా మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతింది. అధికారులు వచ్చి సర్వే చేశారు. కానీ ఇప్పటి వరకు పంట నష్ట పరిహారం అందలేదు. అధికారులకు అడిగితే ప్రభుత్వానికి నివేదిక పంపించామని చెబుతున్నారు. – విజయ్ కుమార్, బోథ్

నష్ట పరిహారం అందలేదు


పంట నష్టం జరిగి ఐదు నెలలు గడుస్తోంది. ఇప్పటికీ ఎలాంటి నష్ట పరిహారం అందలేదు. కొంతమంది రైతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేశారు. మరికొంతమందికి నిధులు విడుదల చేయలేదు. పరిహారం అందించాలి. – సింగం రమణ, బోథ్

‘బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం’


మాట్లాడుతున్న మాజీ ఎంపీ గోడం నగేశ్

ఇచ్చోడ: బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఆదిలాబాద్ మాజీ ఎంపీ, బోథ్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి గోడం నగేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని విఠల్‌రెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనిల్‌జాదవ్‌ను ఆదరిస్తే బోథ్ నియోజకవర్గం మరింత అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. అనిల్‌జాదవ్ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మెహరాజ్ అహ్మద్, మాజీ జెడ్పీటీసీ కృష్ణకుమార్, పాండురంగ్, తిరుమల్‌గౌడ్, ఎంపీటీసీ గాడ్గే సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం ముమ్మరం చేయాలి

తాంసి: బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలని జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు అన్నారు. బుధవారం తాంసి బీఆర్ఎస్ మండల సర్వసభ్య సమావేశాన్ని ఉండం గ్రామ సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు గడపగడపకూ ప్రచారం నిర్వహించాలన్నారు. అందరూ ఐక్యంగా ఉండి పార్టీ గెలుపు కోసం పని చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, పార్టీ కన్వీనర్ అరుణ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సదానంద్, మార్కెట్ డైరెక్టర్ మహేందర్, కృష్ణ, లింగారెడ్డి, గోవర్ధన్, రజనీకాంత్ రెడ్డి, రఘు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ బూటకపు హామీలు నమ్మొద్దు’


విజయ సంకేతం చూపుతున్న జోగు రామన్న

జైనథ్: కాంగ్రెస్ బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం మండలంలోని సాత్నాల బస్‌స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బూటకపు హామీలతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీల అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. పోరాడి సాధించిన తెలంగాణలో బృహత్తర సంక్షేమ పథకాలతో దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రజలు బీఆర్ఎస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రౌత్ మనోహర్, ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, తుమ్మల వెంకట్ రెడ్డి, సర్పంచ్ లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అధ్యాపకులు

ఉట్నూర్‌రూరల్: అథ్లెటిక్స్ పోటీల్లో ఉట్నూర్ ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వరంగల్‌లో జరిగిన 34వ దక్షిణ భారత అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఉట్నూర్ ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు అండర్– 14 విభాగంలో పెందూర్ సతీశ్‌కుమార్ జ్యావలిన్ త్రో క్రీడలో 54.63 మీటర్ల దూరం సరికొత్త జాతీయ రికార్డు నెలకొల్పడం జరిగిందని అధ్యాపకులు తెలిపారు. కొడప పరుశురాం 600 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం సాధించాడు. దీంతో వీరిని కుటుంబసభ్యులు, పాఠశాల అధ్యాపకులు, క్రీడాకారులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉత్తం, పీజీ హెచ్ఎం మెస్రం గంగారాం, ప్రభాకర్, మాధవ్‌రావు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. భీంపూర్ ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని 20 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలతో పాటు రక్త పరీక్షలు చేశారు. న్యూట్రీషియన్ కిట్లు అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నిఖిల్‌రాజ్, సిబ్బంది జ్ఞానేశ్వర్, గంగాధర్, లూసి, సరస్వతి, విజయ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


బోథ్ మండలంలోని సొనాల గ్రామం బైపాస్ రోడ్డు కోతకు గురైంది. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోయింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులకు చెప్పినా.. మరమ్మతులు చేయడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. - బోథ్

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఇచ్చోడ: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని హెల్త్‌అసిస్టెంట్ జాదవ్ కైలాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పలు కాలనీలో దోమల మందు పిచికారీ చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సిబ్బంది వసంత్, సుభాష్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

డిజిటల్ విధానంలో బిల్లులు చెల్లించాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ వినియోగదారులు సులభతరమైన డిజిటల్ విధానంలో బిల్లులు చెల్లించాలని ఆ శాఖ ఎస్ఈ కె.సంపత్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఈఆర్‌వో, పిట్టలవాడ, టీచర్స్‌కాలనీలోని ఈఆర్‌వో సెక్షన్లలో డిజిటల్ చెల్లింపులపై విద్యుత్ వినియోగదారులకు బుధవారం అవగాహన కల్పించారు. వినియోగదారులు బిల్లుల చెల్లింపుల కోసం గంటల తరబడి ఈఆర్‌వో కేంద్రాల్లో నిలబడి ఇబ్బందులు పడకుండా డిజిటల్ పేమెంట్స్ వైపు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు దేవేందర్, హరికృష్ణ, దేవే గౌడ, శంకర్, గన్ను జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

బేల: మండల కేంద్రంలోని కుమురం భీం కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సిడాం నందకుమార్, ఉపాధ్యక్షుడిగా నైతం సీతరాం, ప్రధాన కార్యదర్శిగా కొరంగే జంగ్‌షా, గౌరవ అధ్యక్షుడిగా మడావి సకరాం, కార్యదర్శిగా ఆడ సంతోష్‌తో పాటు మరో పది మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆడ శంకర్, నాయకులు కొరంగే సోనేరావు, తుంరం చందర్‌షావు, టేకం అయ్యా, కాత్లే షేకు, కొడప భీంరావు, సలాం దేవ్‌రావు, సెడ్మకీ రాంజీ పాల్గొన్నారు.

అడహక్ కమిటీ..

ఆదిలాబాద్‌రూరల్: మాల సంక్షేమ సంఘం జిల్లాశాఖ కార్యవర్గం గడువు ముగిసిన్నందున అడహక్ కమిటీని నియమించినట్లు కన్వీనర్ సింగరి అశోక్ అన్నారు. బుధవారం సంఘం భవనంలో వివరాలు వెల్లడించారు. అడహక్ కమిటీ కోకన్వీనర్‌గా కంటె నర్సయ్య, సభ్యులుగా ఆర్ ఆశన్న, ప్రభుదాస్, కొప్పుల రమేశ్, సంటి రవి, బొబ్బిలి స్వామి, మేదరి స్వామిలను ఎన్నుకున్నామన్నారు. సమావేశంలో మాల సంఘం నాయకులు అల్లూరి భూమన్న, దాసరి బాబన్న, సూరం భగవాన్, బేర దేవన్న, మేకల మల్లన్న, రాళ్లబండి శంకర్, మొట్టే కిరణ్, గడుగు నరేందర్, బి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

‘నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు’


మాట్లాడుతున్న భొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: కాంగ్రెస్ అధికారంలో రాగానే నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండలంలోని ధర్మసాగర్‌లో పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ఏర్పడితే నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రజలు బీఆర్ఎస్ బూటకపు హామీలు నమ్మి మోసపోవద్దన్నారు. ఆయన వెంట ఉత్తం, జహీర్, మాణిక్‌రావు, సరిచంద్ నాయక్, సంతోశ్, భగవాన్ పాల్గొన్నారు.

చలో కర్ణాటకకు ఎమ్మెల్యే సిద్ధమా?

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత


గ్యారెంటీ పథకాలను వివరిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పరిశీలించేందుకు కర్ణాటక వచ్చేందుకు సిద్ధమా అని ఎమ్మెల్యే జోగు రామన్నకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత సవాల్ విసిరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరానగర్, హమాలి వాడ, తిలక్‌నగర్ కాలనీల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఆరు గ్యారెంటీ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ ఉద్యోగాల పేరిట యువతను, పథకాల పేరిట రైతులను, మహిళలను మోసం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, నాయకులు వెంకట్ రెడ్డి, చిలుకూరి లక్ష్మారెడ్డి, గుడిపల్లి నగేశ్, అంబకంటి అశోక్, వసీం పాల్గొన్నారు.

‘జోగు రామన్నను ఓడించాలి’

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో జోగు రామన్నను చిత్తుగా ఓడించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో ఆదిలాబాద్ నియోజకవర్గంలోని తర్నం గ్రామస్తులతో పాటు రూరల్ మండలం పరిధిలోని చిచ్‌ధరి ఖానాపూర్, పట్టణంలోని కేఆర్‌కే కాలనీ, దుర్గానగర్, ఇందిరానగర్, డాల్డా కంపెనీ కాలనీవాసులు పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తుందన్నారు. జోగు రామన్న ఆయన నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనా ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఐనేని సంతోష్‌రావు, సయ్యద్ సుజాత్ అలీ, షెడ్మకి ఆనంద్ రావు, నాగర్కర్ శంకర్, కొండూరి రవి, మానే శంకర్, రాజ్ మహమ్మద్, పెందూర్ ప్రభాకర్, శ్రీరామ్, షేక్ మన్సూర్, బూర్ల శంకర్, అన్నెల శంకర్, సమీ ఉల్లాఖాన్, రమేశ్ పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారికే టికెట్


మాట్లాడుతున్న వన్నెల అశోక్

తాంసి: పార్టీ కోసం కష్టపడిన వారికే బోథ్ నియోజకవర్గ టికెట్ వస్తుందని టీపీసీసీ సభ్యుడు వన్నెల అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు అధైర్య పడొద్దని, కాంగ్రెస్ టికెట్ తనకే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చే నాయకులకు టికెట్ ఇవ్వడం కుదరదని గతంలో రాహుల్‌గాంధీ చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందన్నారు. సమావేశంలో మండల కన్వీనర్ సంతోష్, నాయకులు చిన్నరాంరెడ్డి, రతన్, స్వామి, రామన్నయాదవ్, హన్మండ్లు, రాజ్ బలి, గంగారెడ్డి, బాపురావు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

నార్నూర్: కాంగ్రెస్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని టీపీసీసీ సభ్యుడు రాథోడ్ గణేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియా, అంబేద్కర్‌నగర్‌లో పర్యటించారు. పార్టీ కోసం పని చేసే నాయకులకే పార్టీ బీ ఫాం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో యుసుఫ్‌ఖాన్, షెక్ సత్తార్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నార్నూర్: కాంగ్రెస్‌తోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నాయకుడు అజ్మీరా శ్యాం నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని గుండాల, చోర్‌గావ్, సుంగాపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. పార్టీ ప్రకటించిన గ్యారెంటీ పథకాలతోనే బడుగు బలహీనవర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కుటుంబపాలనను తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో లోఖండే దేవ్‌రావు, కైలాస్‌నాయక్, ప్రేమ్, హైమద్ పాల్గొన్నారు.

రథయాత్రకు తరలిరండి


మాట్లాడుతున్న అరెల్లి మల్లేశం

బేల: జిల్లా కేంద్రంలో ఈనెల 20న ప్రారంభమయ్యే ఎమ్మార్పీఎస్ రథయాత్రకు తరలిరావాలని సంఘం జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశం పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. 30 ఏళ్ల నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం చేస్తున్నారని, అయినా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు కృష్ణపెల్లి అంకుష్, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, కార్యదర్శి జితేందర్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: ఈనెల 20న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జరిగే మాదిగల రథయాత్రను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సింగారపు స్వామి మాదిగ కోరారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు


బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

నేరడిగొండ: బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్లు, విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. కళాశాల ప్రిన్సిపాల్ శబాన తరన్నుమ్, రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు వివిధ రకాల పూలతో పేర్చి, గౌరమ్మకు పూజలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మహేందర్ మాట్లాడుతూ బతుకమ్మ ప్రకృతితో మమేకమై సంతోషంగా జరుపుకునే పండుగ అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కాంబ్లే బాలాజీ, వెంకటరమణ, లింగంపల్లి సుజాత, దోమకొండ సుజాత, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.


బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. అందంగా పేర్చిన బతుకమ్మలను ప్రాంగణంలో ఉంచి ఆడిపాడారు. డీజే పాటలకు అనుగుణంగా నృత్యం చేస్తూ.. సందడి చేశారు.

క్లుప్తంగా

దుర్గాదేవికి పూజలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ముత్నూర్, దేవాపూర్, శంకర్‌గూడ, ధనోరా(బి), గౌరాపూర్, అందునాయక్‌తండా, ఎస్టీ గోండ్ గూడ, ప్రధాన్‌గూడ, బజార్‌గల్లి, రాధాకృష్ణ మందిరం గ్రామాల్లో దుర్గాదేవి నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం భక్తులు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, దాండియా నృత్యం ఆకట్టుకుంది.

ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణం విద్యుత్ సౌత్ సెక్షన్ పరిధిలోని విద్యానగర్, ద్వారకానగర్, కోలిపూర, బొక్కల్ గూడ, ఖానాపూర్, అంబేద్కర్‌నగర్ కాలనీల్లో కొత్తగా ఏర్పాటు చేసిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేసి విద్యుత్ సరఫరాను అందుబాటులోకి తీసుకువచ్చారు. కార్యక్రమంలో అకౌంట్స్ జీఎం దేవేందర్, టెక్నికల్ డీఈ ఈదన్న, ఆపరేషన్ డీఈ హరికృష్ణ, ఆపరేషన్ ఏడీ దుర్గాప్రసాద్, ఏఈ సదానందం పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

ఉట్నూర్‌రూరల్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మండలంలోని దంతన్‌పల్లి గ్రామాభ్య సంఘం సభ్యులు బుధవారం జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మర్సుకోల తిరుపతి, దావుల రమేశ్, నర్సయ్య, శైలేందర్, విజయ లక్ష్మి, తారా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన


హోమం నిర్వహిస్తున్న భక్తులు

నేరడిగొండ: మండలంలోని పెద్ద బుగ్గారంలో శ్రీ జగదాంబ దేవి విగ్రహ శిఖర ప్రతిష్టాపన మహోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. పొరదేవి శేఖర్ మహరాజ్, మాహోర్గఢ్ ప్రేమ్ సింగ్ మహరాజ్‌లు హాజరై ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. ప్రతిఒక్కరూ భక్తి భావన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఎంపీపీ రాథోడ్ సజన్, భక్తులు పాల్గొన్నారు.

నేడు శ్రామినేర్ బౌద్ధ ఆచార్య ముగింపు కార్యక్రమం


మాట్లాడుతున్న బౌద్ధ మహాసభ నేతలు

ఆదిలాబాద్‌రూరల్: గత కొన్ని రోజులుగా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శ్రామినేర్ బౌద్ధ ఆచార్య ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించడం జరుగుతుందని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయానంద్ కాంబ్లే, దయానంద్ పాట్వాడే తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో గల అశోక బౌద్ధ వీహార్‌లో మాట్లాడారు. కార్యక్రమానికి బౌద్ధ ఉపాసక, ఉపాసికులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

‘బీఆర్ఎస్ గెలుపే లక్ష్యం’

నేరడిగొండ: బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మండల కన్వీనర్ ఆలూరి శివారెడ్డి, ఎంపీపీ రాథోడ్ సజన్‌లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏలేటి మహేందర్ రెడ్డి, సర్పంచ్ పెంట వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన వీఆర్ఏ మహమ్మద్ ఇస్మాయిల్ (65) అనారోగ్యంతో మృతి చెందాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మరోవైపు ప్రభుత్వం నాలుగు నెలలుగా జీతాలు చెల్లించక పోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు కుటుంబీకులు తెలిపారు. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో సరైన చికిత్స చేయించలేక పోయామని వాపోయారు.